www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 23 నవంబర్ 2022

కడప కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు..!

- ఏర్పాటుపై వ్యతిరేకతలు
- పాత పద్ధతే మేలంటున్న అన్నదాతలు
- అవస్థల్లో రైతులు..
- పట్టని విద్యుత్ అధికారులు

కాలిపోయిన స్మార్ట్ మీటర్

ప్రజాశక్తి - రాయచోటి/రామాపురం

ప్రభుత్వం వ్యవసాయ మోటార్లకు ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్లపై రైతుల్లో పెద్దఎత్తున వ్యతిరేకతలు వ్యక్తమవుతున్నాయి. మీటర్లు వద్దే వద్దని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పాత పద్ధతిలోనే మీటర్లు ఉండాలంటున్నారు. ప్రభుత్వం మాత్రం రైతుల మాటలను పెడచెవిన పెట్టి బలవంతంగా స్మార్ట్ మీటర్లను బిగిస్తోంది. అమర్చిన మీటర్లు ఎక్కువ శాతం కాలిపోతున్నాయి. మోటార్లకు విద్యుత్తు సరఫరా స్తంభించిపోయి రైతులు ఆందోళన చెందుతున్నారు. పునరుద్ధరణకు సిబ్బంది కోసం రెండు, మూడు రోజులపాటు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కడపలోని షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ సంస్థ నుంచి ఎస్‌పిడిసిఎల్ ఈ స్మార్ట్ మీటర్లను కొనుగోలు చేసింది. వాటి పనితీరును పరిశీలించడానికి అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, రాజంపేట నియోజకవర్గలలో ఐదు మండలాల్లో సర్వీసులను విద్యుత్ శాఖ అధికారులు అమర్చారు. రాయచోటి నియోజకవర్గంలో రాయచోటి గ్రామీణ, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, రాజంపేట నియోజకవర్గంలో సుండుపల్లె, వీరబల్లి మండలాల్లో వీటిని ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 1,26,791 సర్వీసులు అందించాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,427 సర్వేసులను పరిసలించడానికి ఏర్పాటు చేశారు. రాయచోటి నియోజకవర్గం రామాపురం మండలంలోని సరస్వతిపల్లెకు చెందిన డేగ రెడ్డెయ్య పొలంలో అమర్చిన మీటరులోని ఎంసిబి, సర్వీసు కేబుళ్లు నెల రోజుల వ్యవధిలో 4 సార్లు కాలిపోయాయి. హడావుడిగా ఎస్‌పిడిసిఎల్ సిబ్బంది వచ్చి విద్యుత్తు సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేశారు. రాజంపేట నియోజకవర్గంలో సుండుపల్లి మండలం తిమ్మసముద్రంలో ఒక రైతు మీటరు కలిపోయినట్లు సమాచారం. దీని వలన 3, 4 రోజులు వేచి చూడాల్సి పరిస్థితి ఏర్పడుతుంది. ఇతర రైతులు తమ సర్వీసులకు మీటర్లు పెట్టొద్దని చెప్పడంతో రామాపురం సెక్షన్లో 70 వరకు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం ప్రయోగాత్మక పరిశీలనకు ఏర్పాటు చేసిన 2 వేల స్మార్ట్ మీటర్లలో చాలా వరకు కాలిపోయినట్లు రైతులు వాపోతున్నారు. మీటరులో అమర్చిన కెపాసిటర్, ఎంసిబి, కేబుళ్లు కాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. కొన్ని చోట్ల మీటర్లతో సంబంధం లేకుండా నేరుగా స్టార్టర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చుకుని మోటార్లు నడుపుకుంటున్నారు. మొదటి దశలను పరిశీలన 3 మండలాలలోని ఇలాంటి సమస్య ఏర్పడితే జిల్లా వ్యాప్తంగా సర్వీస్ మీటర్లు బిగిస్తే ఎలాంటి సమస్య ఏర్పడుతుందో వేచి చూడాలి.

అపోహలు నమ్మొద్దు

వ్యవసాయ మోటర్లు కాలిపోతున్నాయని అపోహలను రైతులు నమ్మొద్దు. మొదటి దశలో పరిశీలన కాబట్టి ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులు వాతావరణం ప్రభావం వలన కాలిపోతున్నాయి. వెంటనే వీటికి మరమ్మతులు కూడా కంపెనీ వారు చేస్తున్నారు. ఈ మీటర్లకు 10 ఏళ్ల గ్యారెంటీ కూడా ఉంటుంది. రైతులు ఎలాంటి అపోహలు నమ్ముకుండా సర్వీస్ మీటర్లు రైతులందరూ బిగించుకోవచ్చు.

- వై.చంద్రశేఖర్‌రెడ్డి, ఇఇ, విద్యుత్ శాఖ, రాయచోటి.

పాత మీటర్లే మేలు

పాత మీటర్లే మేలు. స్మార్ట్ మీటర్లతో ఉపయోగం లేదు. స్మార్ట్ మీటర్లు కాలిపోతున్నాయి. పాత పద్ధతిలోనే వ్యవసాయం చేసుకుంటున్నాం. పంట సాగు చేసుకున్న మొదట్లో నా మోటార్‌కు స్మార్ట్ మీటర్ బిగించారు. దిక్కుల సమయంలో మోటార్ మీటర్ ఆగిపోవడంతో మోటర్ కూడా కాలిపోయింది.

-డేగల రెడ్డయ్య, సరస్వతిపల్లె, రామాపురం.

వర్షాలకు మీటర్‌లో శబ్ధం వచ్చింది

గత వారంలో కురిసిన వర్షాల సమయంలో స్మార్ట్ మీటర్ల నుంచి శబ్దం వచ్చి మీటర్ కాలిపోయింది. ఆ సమయంలో మాకు కరెంటు అవసరం లేకుండా పోయింది. వర్షం వల్ల పంట పండిపోయింది. పొద్దుతిరుగుడు పంట సాగు సమయంలో మామూలు కనెక్షన్ తీసుకుంటాం.

- చెన్నూరి నారాయణమ్మ, సరస్వతిపల్లె, రామాపురం.

బకాయిల కోసమే పోరాటం : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయుల పోరాటం గొంతెమ్మ కోర్కెల కోసం కాదని, ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన బకాయిల కోసమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజ పేర్కొన్నారు. మంగళ వారం కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉమ్మడి జిల్లాల అధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి రాజా మాట్లా డుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు పాదయాత్రలలోనూ, పలు బహిరంగ సభల్లో తాను అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తానని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తానని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలు ఇస్తానని పలు హామీలు ఇచ్చి నమ్మించి మోసం చేశారని పేర్కొన్నారు. సిపిఎస్ విధానం అలాగే కొనసాగుతోందని చెప్పారు.. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధా నాన్ని పునరుద్ధరిం చాల్సిందేనని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ వేతనాల నుంచి తమ అవసరాల కోసం దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ రుణాలను ఏళ్ల తరబడి చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిఆర్‌సి, డిఎ బకాయిలు చెల్లించిన పాపాన పోలేదన్నారు. మెడికల్ రీయిం బర్స్‌మెంట్, సరెండర్ లీవ్ బకాయిలు సైతం ఏడాదికాలంగా చెల్లింపులకు నోచుకోవడం లేదని తెలిపారు. తమ అవసరాల కోసం దాచుకున్న సొమ్మును ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకో వడం వల్ల ఉద్యోగ,ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బం దులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.హరిప్రసాద్, ఎస్.జాబిర్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు తాము దాచుకున్న సొమ్మును వారి అవసరాలకు చెల్లించకుండా వేధించిన ప్రభుత్వంగా జగన్మోహన్‌రెడ్డి సర్కార్ చరిత్రలో మిగిలిపో తుందన్నారు. తమకు రావాల్సిన బకాయిల కోసం ఉద్యోగులు ఉద్యమిస్తే, ఉద్యోగులవి గొంతెమ్మ కోరికలని పేర్కొనడం మంత్రి బొత్స కే చెల్లిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రజలలో, ప్రభుత్వంలో భాగం కాదా అని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన అన్ని రకాల బకాయిలను తక్షణమే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు లేనిపక్షంలో ఈనెల 30న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.ఓబుల్ రెడ్డి, సహాధ్యక్షురాలు డి.రూతు ఆరోగ్య మేరీ, జిల్లా కార్యదర్శులు ఎస్.దావుద్దీన్, చెంగల్ రాజు, వై.మస్తానయ్య, పి.చంద్రశేఖర్, కె.జోజయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు సుజాత, సిపిఎస్ జిల్లా కన్వీనర్లు రమణమూర్తి, సుదర్శన్, పట్టణ కార్యదర్శి కరీముల్లా నాయకులు యస్.శశిధర్ కుమార్, కె.చెన్నయ్య పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్ పర్యటన వాయిదా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి మదనపల్లె పర్యటన మరోసారి వాయిదా పడింది. తుఫాన్ కారణంగా పర్యటనను వాయిదా వేసినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సమాచారం అందినట్లు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. ఈ నెల 29 లేదా 30 తేదీలలో ముఖ్యమంత్రి పర్యటన ఉంటుందని చెప్పారు. కాగా సిఎం పర్యటన వాయిదా పడకముందు ఏర్పాట్లను కలెక్టర్ గిరీష, ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు, రాజంపేట, చిత్తూరు ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రెడ్డప్ప, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె శాసనసభ్యులు నవాజ్‌బాషా, చింతల రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, మదనపల్లె, రాజంపేట, రాయచోటి ఆర్‌డిఒ మురళి, కోదండరామిరెడ్డి, రంగస్వామి, డిఇఒ రాఘవరెడ్డి, తదితరులు అధికారులతో కలిసి పరిశీలించారు.

సైన్స్ ఎగ్జిబిషన్ విజయవంతం

ప్రజాశక్తి - రాయచోటి

సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ విజయవంతమైందని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఐదు అంశాలలో 51 ప్రాజెక్టులను విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించారని చెప్పారు. వాటిని న్యాయ నిర్ణేతలు పరిశీలించి ఒక్కొక్క విభాగం నుంచి ఒక్కో ప్రాజెక్టును ఎంపిక చేస్తారన్నారు. అలా మొత్తం ఐదు ప్రాజెక్టులను డిసెంబర్ 12న మండల స్థాయిలో నిర్వహించే పోటీలకు పంపు తారన్నారు. ప్రాజెక్టుల ప్రదర్శన వల్ల విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంపొం దుతుందని తెలిపారు. సైన్స్ సబ్జెక్టు పట్ల భయం పోయి ఆసక్తి పెరుగుతుందని చెప్పారు. అనంతరం ఉత్తమ ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్, సైన్స్ ఉపాధ్యాయులు ఉమాదేవి, రామయ్య, నబి రసూల్, శశికళ పాల్గొన్నారు.

రేపు జగనన్న క్రీడా సంబరాలు

బి.కొత్తకోట: జగనన్న క్రీడా సంబరాలలో భాగంగా తంబళ్లపల్లె నియోజకవర్గస్థాయి ఎంపికలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) బి.కొత్తకోటలో ఈనెల 24వ గురువారం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గం క్రీడా సమన్వయకర్త ఎస్.తాజాబాషా పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టండి : సిపిఎం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి డి.ప్రభాకర్‌రెడ్డి, నాయకులు టి.హరింద్రనాథ్ శర్మలు తెలిపారు. మంగళవారం స్థానిక సిపిఎం కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ భారతదేశంలోనే సహజసిద్ధమైన చల్లని వాతావరణం, ప్రశాంతమైన జీవనం, ఆరోగ్యం అందించుటలో ఆసియాలోనే పేరెన్నికగన్న ఆరోగ్య కేంద్రమున్న మదనపల్లె ప్రస్తుత పరిస్థితి చూస్తే అధ్వాన్నంగా ఉందని పేర్కొన్నారు. తాగునీరు లేక, ఉపాధి కరువై వలసలు తప్పనిస్థితి ఏర్పడిందన్నారు. మెరుగైన వైద్య సౌకర్యాలు లేక ప్రాణాలు పోగొట్టుకోవాల్సిన దుస్థితి ఉందని పేర్కొన్నారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. హంద్రీ-నీవాకు నికర జలాలు కేటాయించి వెంటనే పూర్తి చేయాలని, అందుకు అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కండలేరు పైపులైను పనులను పునరుద్ధరించాలన్నారు. మదనపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రోడ్ల ఆక్రమణలు తొలగించాలని, రోడ్లు వెడల్పు చేయాలని, అందుకు అవసరమైన భూమిని 2013 భూసేకరణ చట్టం ప్రకారం సేకరణ చేయాలని, పుట్పాత్‌లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఏరియా ఆసుపత్రిని 300 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలన్నారు. బిటి కళాశాలను ప్రభుత్వ కాళాశాలగా మార్చినందుకు అభినందనలనీ, యూనివర్శిటీ స్థాయిని కల్పించాలని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. టమోటా హబ్ ఏర్పాటు, పల్ప్ పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. మూతపడిన స్పిన్నింగ్ మిల్, క్లీన్ ఫుడ్స్ పరిశ్రమలు తెరిపించాలన్నారు. డైలీ మార్కెట్, వారపు సంత, టమోటా మార్కెట్ యార్డులో మౌళిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. టమోటా మార్కెట్ యార్డుకు 100 ఎకరాలు స్థలం కేటాయించాలన్నారు. విలువ ఆధారిత ఆస్తి పన్ను, చెత్త పన్ను, డ్రైనేజీ పన్ను రద్దు చేయాలన్నారు. పై సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుని మదనపల్లె అభివృద్ధిలో భాగస్వాములు కావాలనికోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, సురేంద్ర పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

నూతన సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఆకేపాటి, మేడా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఆకేపాటి, మేడా

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. మంగళవారం పాత బస్టాండ్ కూడలిలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో పెరుగుతున్న రద్దీని నియంత్రించేందుకు ఈ ట్రాఫిక్ సిగ్నల్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. వాహనదారులు నేటి నుంచి నిబంధనలను అనుసరించి ట్రాఫిక్ నియంత్రించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి, కమిషనర్ ఎం.జనార్దన్ రెడ్డి, పట్టణ సీఐ నరసింహారావు, ఎస్‌ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నూతన సచివాలయాల ప్రారంభోత్సవం

పురపాలక పరిధిలోని అమ్మవారిశాల వీధి, ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సచివాలయాలను ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలన్నారు. సచివాలయం ద్వారా అందించే సేవలు నిర్ణీత గడువులోగా ప్రజలకు చేరవేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.జనార్దన్ రెడ్డి, వైస్ చైర్మన్ మర్రి, కౌన్సిలర్లు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

విజయవాడలో ఈ నెల 18, 19వ తేదీలలో జరిగిన రాష్ట్ర సీనియర్ బాలికల విభాగం అంతర్ జిల్లా షూటింగ్ బోల్ రాష్ట్ర స్థాయి పోటీలలో తంబళ్లపల్లి విద్యార్థినిలు ప్రతిభ కనబరిచారు. తంబళ్లపల్లి ఏపీ మోడల్ స్కూల్లో బైపిసి ద్వితీయ సంవత్సరం చదువుతున్న వి.ప్రవీణ, పదవ తరగతి చదువుతున్న ఎస్.సమీరా జిల్లా జట్టు తరపున రాష్ట్ర స్థాయి తృతీయ స్థానాన్ని దక్కించుకోవడం వల్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఎస్.హేమంత్ కుమార్, పిఇటి, పి.లత, ఉపాధ్యాయులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

మోడల్ స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

హింసలేని సమాజంతోనే మహిళా సాధికారిత

మహిళా శిశు సంక్షేమ శాఖ సీనియర్ కౌన్సిల్ పర్వీన్

ప్రజాశక్తి - రాయచోటి

హింస లేని సమాజం ఉన్నప్పుడే మహిళా సాధికారత సాధ్య మని కడప, అన్నమయ్య జిల్లాల మహిళా శిశు సంక్షేమ శాఖ సీనియర్ కౌన్సిల్ పర్వీన్ అన్నారు. సిఎంఎస్ (సెంట్రల్ ఫర్ వరల్డ్ సాలిడారిటీ) ఆధ్వ ర్యంలో రాయచోటి ఎన్‌జిఒ హోమ్‌లో మహిళా సాధికారిత పై మంగళ వారాం సిఎంఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ సమావేశానికి అధ్యక్షత సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేవలం చట్టాలతోనే మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టలేమని చెప్పారు. చిన్న వయసు నుంచే తల్లిదండ్రులు పిల్లలను సమానంగా పెంచాల్సిన అవసరముందని చెప్పారు. గృహింస రక్షణ చట్టంపై ఆమె ప్రత్యేకంగా వివ రించారు. సిఎంఎస్ స్టేట్ కో-ఆర్డినేటర్ వైశాలి మాట్లాడుతూ అన్ని రంగా లలో మహిళలు ముందుకు పోతున్నప్పటికీ శారీరక, మానసిక హింస వారిని వెనక్కి నెడుతోందని తెలిపారు. దీన్ని పురుష ప్రపంచం ఆలోచించి మహిళలను మనుషులుగా చూడాలని వారి హక్కులను అనుభవిం చుకు నేలా చేయాలన్నారు. అన్నమయ్య జిల్లా న్యాయవాదుల సంక్షేమ సమితి అధ్యక్షులు రాజకుమార్ రాజు అఖిలభారత న్యాయవాదుల సమైక్య జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ మాట్లాడుతూ సమాజంలో సగభాగం ఉన్న స్త్రీలు పురు షులతోపాటు సమాన హక్కులు అనుభవించలేకపోతున్నారని, చెప్పారు. కొంతమంది పురుషులు మానవ మృగాలుగా ప్రవర్తిస్తూ మహిళలను అత్యంత దారుణంగా హత్యలు చేస్తున్నారని వాపోయారు. దీనిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. మానవ మృగాలను సమాజం నుంచి వెలివేసిమహిళల జీవించే హక్కును కాపాడాల్సిన బాధ్యత పాలకులపై ఉందని వారు పేర్కొన్నారు. మహిళలకు రక్షణ కల్పి స్తున్న ఐసిపి సెక్షన్లు 354, 366 ఏ, 376, 494, 498, 509 గురించి వివరించారు. కార్యక్రమంలో డ్రాప్స్ స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షులు సుగుణ, ఎన్‌జిఒ కన్స ల్టెంట్ షరీఫ్, డ్రాప్స్ ఫీల్డ్ ఆఫీసర్ ఉమాదేవి, వివిధ గ్రామాల నుంచి వచ్చిన సచివాలయ ఉద్యోగులు, అంగన్వాడీలు పాల్గొని ప్రసంగించారు. అనంతరం మహిళలపై జరుగుతున్న హింసను వ్యతిరేకిం చాలంటూ సదస్సులో పాల్గొన్న వ్యక్తులు పోస్టర్లను విడుదల చేశారు.

గృహహింసను వ్యతిరేకించాలంటూ పోస్టర్లను విడుదల చేస్తున్న వక్తలు

డిఇఒను సస్పెండ్ చేయాలి : ఎస్‌ఎఫ్ఐ, ఐఎఫ్‌ఎస్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లా డిఇఒ రాఘవరెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్‌ఎఫ్ఐ, ఐఎఫ్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం చెవులో పూలు పెట్టుకుని డిఇఒ కార్యాలయం ఎదుట వినూత్నంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, ఐఎఫ్‌ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సాయికుమార్ మాట్లాడుతూ డిఇఒ వ్యవహార తీరు పట్ల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యచరణ ప్రకటిస్తామని తెలిపారు. డిఇఒ కులం, మతం పేరుతో ఉపాధ్యాయులను దూషిస్తున్నారని, గిట్టని వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చి ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడుతున్నాని పేర్కొన్నారు. ఈ విషయాలన్నింటిని కలెక్టర్‌కు పూర్తి సమాచారంతో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అయిన వారి పట్ల ఒక రకంగాను, కాని వారి పట్ల కఠినంగా వ్యవహరించి పాలేగాళ్లను తలపిస్తున్నారని వాపోయారు. దళితులు, మైనారిటీలు ,బలహీన వర్గాలు. మహిళల పట్ల ఆయన వ్యహార శైలి అభ్యంతరంకరమన్నారు. చిన్న చిన్న కారణాలతో తనకు గిట్టని ఉపాధ్యాయులను కార్యాలయానికి పిలుపించుకుని అపరాధ రుసుం వేస్తూ అవినీతికి పాల్పడుతున్నారని తెలిపారు. ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలైతే నిబంధనలను అతిక్రమిస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ నాయకులు ఫక్రుద్దీన్, రాజు, శ్రీనాథ్, మనోజ్, నరేష్, నాగేంద్ర, సులేమాన్ పాల్గొన్నారు.

చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలుపుతున్న నాయకులు

సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

నవరత్నాలతో నవశకానికి నాంది : 'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రాష్ట్రంలో నవరత్నాల పథకాలతో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నవ శకానికి నాంది పలికారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని సచివాలయం 1 పరిధిలోని ఐఎవై కాలనీ, ఫింగాణి ఫ్యాక్టరీ ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి గడిచిన మూడున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, వాటితో కలిగిన ప్రయోజనాన్ని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సచివలయ వ్యవస్థతో చరిత్ర సృష్టించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారన్నారు. సుపరిపాలన, సంక్షేమ పథకాల అమలును చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ప్రజలు గమనించి ప్రతిపక్షాలకు సరైన బుద్ధి చెబుతారన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్, ఇఒ ఉదయ్ కుమార్, సర్పంచ్ గంగులమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ మిథున్ చక్రవర్తి, ఇరిగేషన్ ఎఇ రామచంద్ర, ఎఒ హేమలత, ఎపిఒ ప్రసాద్ బాబు, ఎపిఎం నరసింహులు, విఆర్ఒ సుధాకర్, నాయకులు నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, అబ్దుల్ కలీమ్, మధనమోహన్ రెడ్డి, లక్ష్మినారాయణ, ఆనంద, సైఫుల్లా, వేణు, సుధాకర్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

తిప్పాయపల్లెలో ఆధార్ మొబైల్ క్యాంప్

ప్రజాశక్తి - పుల్లంపేట

మండల పరిధిలోని తిప్పాయపల్లెలో ఈ నెల 23, 24 తేదీలలో ఆధార్ మొబైల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ప్రకాశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2011 సంవత్సరం నుండి 2016 సంవత్సరం మధ్యలో ఆధార్ కార్డు చేయించుకున్న వారు తప్పనిసరిగా ఆధార్ డాక్యుమెంట్ అప్డేట్ చేయించుకోవాలని తెలిపారు. ఆధార్ అప్డేట్ కోసం వచ్చేవారు తప్పనిసరిగా ఇతర ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు. ఓటర్ ఐడి, పాన్ కార్డు, బ్యాంక్ అకౌంట్, పాస్పోర్ట్ మొదలగు వాటిని తీసుకురావాలని పేర్కొన్నారు. ఆరు నుంచి 15 ఏళ్ల మధ్య గల పిల్లలు ఆధార్ మాండేటరీ అప్డేట్ చేసుకోవాలన్నారు. ఇతర ఆధార్ సేవలు కూడా వినియోగించుకోవాలని తెలిపారు. ఆధార్ అప్డేట్ చేపించుకోకుండా ఉంటే భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలలో అందే లబ్ది కోల్పోయే అవకాశం ఉందని పేర్కొన్నారు.

బహుమతులను అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందని స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జ్ హెచ్ఎం అమరనాథ రెడ్డి అన్నారు. మంగళవారం గ్రంథాలయ వారోత్సవాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉయ్ లవ్ రీడింగ్, చదవటం మాకిష్టం వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం విద్యార్థులలో చక్కని పఠనాసక్తిని తీసుకొస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్ర రెడ్డి, పురుషోత్తం, మాండవ్య, భాస్కర్ నాయక్, హైమావతి, శంకర, చంద్రశేఖర్, నాగసులోచన, దుర్వాసులు నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫైబర్ సిలిండర్‌ను సద్వినియోగం తీసుకోవాలి

సిలిండర్లు పంపిణీ చేస్తున్న సునీత

ప్రజాశక్తి-రామాపురం

ఫైబర్ సిలిండర్‌ను కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని ప్రభాకర్ ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సి.వి. సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. మండలంలోని హసనాపురం పంచాయతీ స్థానములేశ్వర స్వామి శివాలయంలో మంగళవారం లక్కిరెడ్డిపల్లె మాజీ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆవుల సునీత చేతుల మీదుగా కస్టమర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఐఒసిఎల్ ఇండియన్ గ్యాస్ పది కిలోల సిలిండర్లు అందుబాటులోకి తెచ్చాయన్నారు. ప్రభాకర్ ఇండియన్ ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సివి సుబ్బారెడ్డి కస్టమర్లకు తొలి 10 కిలో సిలిండర్లు కస్టమర్లకు తన చేత పంపిణీ చేయించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి కస్టమర్ రెండవ సిలిండర్‌గా 10 కిలోలు సిలిండర్‌ను వినియోగించుకోవాలని డిస్ట్రిబ్యూటర్ అన్నారు. కార్యక్రమంలో ఆలయం ట్రస్ట్ చైర్మన్ చలమారెడ్డి మేనేజర్ రమణారెడ్డి, రంగారెడ్డి, ఈశ్వరమ్మ, శివ, ధనంజయ పాల్గొన్నారు.

మట్లిలో పొలంబడి

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని మట్లి పచాయతీ, రైతు భరోసా కేంద్రంలో మంగళవారం వ్యవసాయ అధికారి స్వాతి ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ 14 వారాలపాటు ఎంపిక చేసుకున్న 25 మంది రైతుల చేత కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. .రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించి పంట సాగులో తక్కువ పెట్టుబడితో, ఎక్కువ దిగుబడులు సాధించేటట్లు అవగాహన కల్పిస్తారని తెలిపారు. మూడు సీజన్లకు సంబంధించి యాజమాన్య పద్ధతులపై పాటించిన రైతులకు జిఎపి సర్టిఫికెట్ ఇస్తారన్నారు. ఈ సర్టిఫికెట్ వల్ల రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగార్జునచారి, సుధాకర్‌రావు, సింగల్ విండో ప్రెసిడెంట్ రమణారెడ్డి, రాజారెడ్డి, ఏవో, ఎఇలు శ్రీకాంత్, జయరాణి, రవి, ఏవో స్వాతి, షన్ముగం ,సుచరిత, రమేష్, రైతులు పాల్గొన్నారు.

అవార్డు స్వీకరిస్తున్న అధ్యాపకులు రాజేంద్రప్రసాద్

రాజేంద్రప్రసాద్‌కు కనకరత్న అవార్డు

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక జెఎన్‌టియులో అధ్యాపకులుగా పనిచేస్తున్న రాజేంద్రప్రసాద్‌కు కనకర్త అవార్డును కనకదాస్ ఫౌండేషన్ రెండో వార్షికోవత్సం సందర్భంగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కనకదాస అవార్డుకు ఎంపిక అవడం గర్వకారణం ఉందన్నారు. అవార్డ్‌ను శ్రీశ్రీ సిద్ధ రామానంద స్వామీజీ చేతుల మీదుగా తీసుకోవడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు.

చిన్నప్పకు నివాళులర్పిస్తున్న వైస్ ఎంపిపి యధుభూషణ్‌రెడ్డి

విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-గాలివీడు

విశ్రాంత ఉపాధ్యాయుడు కోసినేపల్లి చిన్నప్ప (85) మంగళవారం ఉదయం మృతి చెందారు. మృతుని సతీమణి కూడా ఉపాధ్యాయురాలు. ఇద్దరూ గాలివీడు మెయిన్ పాఠశాలలో పనిచేశారు. వారి కుమారుడు శ్రీనివాసులు ఆర్అండ్‌బి డిఇగా విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు, వైసిపి నాయకులు ఎస్.కె. ఖాదర్‌మోహిద్దీన్, సర్పంచ్ లక్ష్మీదేవి, వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషన్‌రెడ్డి, పలువురు ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్ లక్ష్మీకర్ చిన్నప్ప మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రేపు వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ

బ్రహ్మంగారిమఠం : మైదుకూరు పట్టణంలో గురువారం నిర్వహించే వ్యవసాయ కార్మిక సంఘం 6వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి.శివ కుమార్ కోరారు. స్థానిక సుందరయ్య భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభకు సంఘం రాష్ట్ర కార్యర్శి వెంకటేశ్వర్లు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా గతకాలపు పోరాటాలను సమీక్షించి, అనంతరం రాబోవు రోజుల్లో నిర్వహించాల్సిన కర్తవ్యాలను రూపొందించనున్నారని తెలిపారు. గురువారం ఉదయం 10 గంలకు పొట్టిశ్రీరాములు సర్కిల్ నుంచి ర్యాలీగా కడప రోడ్డులోని షాదీఖానా వరకు నిర్వహిస్తామన్నారు.

NAME CHANGE

I, Dharani Dhileep Kumar, S/o Dharani Nagaiah, Passport No.R0723882, D/No. 5/25, C.M.Balijapalli (Vi), Mukkavari palli, Obulavaripalli (M), Y.S.R. Kadapa (Dt), A.P. 516108. has Changed my Name from Darnala Dileep Kumar to Dharani Dhileep Kumar (New Name).

ప్రజలకు మెరుగైన సేవలందించాలి : మేడా

శుభాకాంక్షలు తెలుపుకుంటున్న మేడా, పోలా

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కౌన్సిలర్లు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే మేడా వెంకట మల్లిఖార్జునరెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన కౌన్సిలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ కౌన్సిలర్లు తమ తమ వార్డుల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. పట్టణాభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి సభ్యులతో చర్చించారు. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రాజంపేట మున్సిపాలిటీని సమస్యలు లేని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మసలుకోవాలని సూచించారు. పాలకవర్గం ఎన్నికై నేటికి ఏడాది పూర్తయిన సందర్భంగా కౌన్సిలర్ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లి మల్లికార్జున రెడ్డి, మునిసిపల్ కమిషనర్ ఎం.జనార్ధన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

చిట్వేలి : బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -చిట్వేలి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం బహుమతుల ప్రదానం చేశామని ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక గ్రంథాల శాఖ నిర్వాహకులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. గతవారం వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వ్యాసరచనలో సీనియర్ విభాగంలో డి.శివాజీ, ఏ.స్పందన, చైత్ర, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, జూనియర్ విభాగంలో ముజాహిద్, పసుపుల యజ్ఞధర్, పి.లక్ష్మీ త్రివేణి, ప్రతమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, చిత్రలేఖనంలో సీనియర్ విభాగంలో ఏ.స్పందన, శివాజీ, భాగ్యలక్ష్మి, ప్రతమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, జూనియర్ విభాగంలో పి.విష్ణుప్రియ, శ్యామ్ రాజ్, లక్ష్మీ జెసిత, ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులు పొందారని పేర్కొన్నారు. కన్సోలేషన్ బహుమతులు ప్రతి విభాగంలో ఐదుగురు చొప్పున 20 మందికి ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీ డేవిడ్ ప్రసాద్, ఎన్‌సిసి అధికారి పసుపుల రాజశేఖర్, దుర్గరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందలూరు : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జెవివి నాయకులు

నందలూరు : సమాజంలో శాస్త్రీయ దృక్పథం నెలకొల్పడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని జెవివి జిల్లా అధ్యక్షులు రౌఫ్ బాష, నందలూరు మండల నాయకులు శామ్యూల్, కృపానందం, రమేష్, ఇమాం బాష తెలిపారు. మంగళవారం స్థానిక నందలూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విభాగాల్లో మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు సైన్స్ భావజాలాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. వాస్తవికత, మూఢచారాల మధ్య తేడాలను వివరించారు. టాలెంట్ టెస్ట్‌లో ప్రయివేట్ స్కూల్ విభాగంలో ఆల్విన్ మౌంట్ కార్మెల్ స్కూల్ విద్యార్థులు మొదటి స్థానం సాధించారు. రెండో స్థానం ఆడపూరు సాయి విద్యా నికేతన్ విద్యార్థులు సాధించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మహాత్మ జ్యోతిబాపూలే బిసి బాలికల గురుకుల పాఠశాల కు చెందిన విద్యార్థులు మొదటి స్థానం సాధించారు. రెండవ స్థానం లేబాక హై స్కూల్ విద్యార్థులు సాధించారు. గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, పథకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు క్రిష్ణకిషోర్, చాంద్ బాష, గంగరాజు, బాబు, పద్మ, మనోహర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మదనపల్లె ప్రజలకు సిఎం క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మదనపల్లె ప్రజలకు క్షమాపణ చెప్పాలని టిడిపి రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లె జిల్లా చేయాలనే డిమాండ్ విస్మరించి రాయచోటి జిల్లా చేయడం ఈ ప్రాంత ప్రజల మనోభావాలను పరిగణలోకి తీసుకోక పోవడమే అన్నారు. దీనిపై మదనపల్లె ముందుగా మదనపల్లె ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. వైసిపి అధికారం చేపట్టిన నాటి నుండి మదనపల్లె ప్రాంత అభివృద్ధి ఎం జరిగిందో చెప్పాలన్నారు. హంద్రీనీవా కాలువలలో నీరు రాకపోగా నిరుపయోగంగా మారాయని విమర్శించారు. చిప్పిలి, గుట్టకిందపల్లి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తి చేయలేదన్నారు. రహదారుల విస్తరణ లేదన్నారు. సమావేశంలో మస్తాన్, బివి.రమణ, నవీన్ చౌదరి, శివకృష్ణ, బాబ్‌జాన్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కొత్తపేట విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - పుల్లంపేట

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు కొత్తపేట జిల్లా పరిషత్ హై స్కూల్ క్రీడాకారిణిలు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు జయలక్ష్మి, పీడీ బాల శేఖర్

క్రీడాకారులతో ప్రధానోపాధ్యాయులు, పీడీ

తెలియజేశారు. ప్రొద్దుటూరులో జరిగిన ఎంపికలలో పాఠశాలలో చదువుతున్న శ్రీజ అండర్-17 విభాగంలోనూ, 8వ తరగతి చదువుతున్న అండర్-14 విభాగంలోనూ ఎంపికైనట్లు వారు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తపేట పాఠశాలలో చదువుతున్న క్రీడాకారిణిలు జాతీయ స్థాయిలో రాణించడం చాలా ఆనందంగా ఉందని, సమాన ప్రాధాన్యత కల్పించి ప్రోత్సహించినప్పుడే విద్యార్థులకు మంచి విజయాలు సాధిస్తారని వారు తెలియజేశారు. కొత్తపేట పాఠశాలకు సంబంధించి క్రీడల్లో సత్తా చాటుతున్న క్రీడాకారులకు అండగా నిలవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని, క్రీడల్లో పాల్గొనడం వలన వచ్చే క్రీడా సూార్తితో భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని కావున క్రీడాకారునిలు, క్రీడాకారులు జాతీయ స్థాయిలో సత్తా చాటి పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారినిలను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రతరం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

తమ సమస్యలను ప్రభుత్వం, యాజమాన్యం వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆర్‌టిపిపి కార్మికుల రీజినల్ జెఎసి పేర్కొంది. కాంట్రాక్ట్ కార్మికులు చేస్తున్న నిరసన మంగళవారం కూడా మెయిన్ గేట్ వద్ద కొనసాగింది. ఈ సం దర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎపి జెన్‌కోలో కాంట్రాక్ట్ కార్మికులుగా చాలీచాలనీ జీతాలతో పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమను పర్మినెంట్ చేయకుండా జిఒ 163 తెచ్చి కొత్తవారిని నియమించడం దారుణమన్నారు. సమస్యను పరిష్కరించాలని గతంలో ఎన్నోసార్లు విన్నవించినా ఫలితంలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

టిటిడి చెంతకు 'ప్రకృతి' శనగలు

ప్రజాశక్తి - వేముల

ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో పండించిన శనగలను టిటిడి దేవస్థానానికి పంఎ్‌నున్నారు. వీటిని అక్కడ లడ్డూ తయారీలో విని యోగిస్తారు. మం డలంలోని గొందిపల్లి రైతు చంద్ర మోహన్‌రెడ్డి రసాయనాలు వాడకుండా ఉత్పత్తి చేసిన శనగలను టిటిడికి తరలిం చను న్నారు. విత్తనంతో పాటు వేప పిండి, ఆముదం పిండి సాగులో వేశారు. అంతర పంటలుగా ఆవాలు, ధనియాలు, ఎరా పంటగా పొద్దుతిరుగుడు చుట్టూ రక్షణగా జొన్న పంట వేశారు. 20 రోజుల్లో పంట దిగుబడి వస్తుంది. పచ్చ పురుగు నివారణకు ముందు జాగ్రత్తగా 5 రకాల ఆకులతో ఆముదం, సీతాఫలం ఆకు, బొప్పాయి ఆకు, ఉమ్మెత్త ఆకు, వేప ఆకు, ఆవు మూత్రంతో బ్రహ్మాస్త్రం కషాయాన్ని తయారీ చేయించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎం.రామంజనేయులు, వెంకటేశు, వినోద్‌కుమార్‌రెడ్డి, శాంతమ్మ పాల్గొన్నారు.

లక్ష్యా అకాడమీ విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-కడప సిటీ

ఎస్ఎస్‌సి-జిడి ఉద్యోగాలో లక్ష్యా అకాడమీ కోచింగ్ సెం టర్ విద్యార్థులు ప్రభం జనం సృష్టించారని డైరెక్టర్ బసిరెడ్డి పోలిరెడ్డి పేర్కొన్నారు. ఆయన ప్రజా శక్తితో మాట్లాడుతూ గత ఏడాది జులైలో విడు దలైన ఎస్ఎస్‌సి -జిడి ఉద్యోగాల భర్తీ కోసం ప్రకటన విడుద్లైందని చెప్పారు. తమ ఇన్‌స్టి ట్యూట్‌లో శిక్షణ తీసుకున్న ఆరుగురు పరీక్షల్లో విజయం సాధించారని పేర్కొ న్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిలో సునీత, ఎ.సురేష్, కె.పవన్ కళ్యాణ్, బి.సురేంద్రకుమార్‌రెడ్డి, ఆర్. జ్ఞానేంద్ర, విష్ణు ఉన్నారని చెప్పారు. వారు విజయం సాధించడంలో కృషి చేసిన లక్ష్యా అకాడమీ అధ్యాపకులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఇటీవలే తిరిగి ఎస్ఎస్‌సి-జిడిలో 24369 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల విడుదలైందని, ఈనెలాఖరి దరఖాస్తుకు గడువు అని పేర్కొన్నారు. ఓసి అభ్యర్థులు 26 ఏళ్లు, ఎస్‌సి, ఓబిసిలు 29 ఏళ్లుగా, ఎస్‌సి, ఎస్‌టిలు 31 ఏళ్ల వయోపరిమితి కలద న్నారు. కరోనా కారణంగా మూడేళ్ళు అన్ని వర్గాల వారికి వయో పరిమితి పెంచారని అభ్యర్థులు గమనించాలని తెలిపారు. తమ లక్ష్యా అకాడమీలో ఎస్ఎస్‌సి - జిడి క్లాసులు ప్రారంభమయ్యాయని, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

బడా బాబుల గుప్పిట్లో అసైన్డ్ భూములు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల నియోజకవర్గంలో బినామీ పేర్లతో బడా బాబుల గుప్పెట్లో అసైన్ భూములు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేలూరు శ్రీనివాసులురెడ్డి తెలిపారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నియోజకవర్గంలో అసైన్డ్ భూములు వందల ఎకరాల చొప్పున బినామీల పేరు మీద నడుస్తు న్నాయని ఆరోపించారు. ఎక్కడైతే అసైన్డ్ భూములు బినామీల పేరు మీద ఉన్నాయో వాటిని నిగ్గు తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బినామీల పేరుతో ఉన్న భూములను అర్హులకు పంచాలన్నారు.

యువత వ్యాపార రంగంలో రాణించాలి : ఎంపీ

ఫర్నీచర్ షాపును ప్రారంభిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

వేంపల్లె : యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా వ్యాపార రంగం వైపు దృష్టి పెట్టి, అందులో రాణించాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సూచించారు. స్థానిక మైనార్టీ ఈద్గా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మేరిజాన్ ఫర్నిచర్ దుకాణాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వ్యాపార రంగంలో రాణించేందుకు నాణ్యమైన వస్తువులను వినియోగదారులకు విక్రయించాలన్నారు. వ్యాపార రంగం వల్ల మరికొంత మందికి ఉపాధి అవకాశాలు కల్పించే వీలుంటుందన్నారు. వ్యాపార రంగంలో ఓర్పు ముఖ్యమన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వైసిపి ప్రభుత్వం పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను ఎంపీ స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి, సివిల్ సప్లయ్ డైరెక్టర్ షబ్బీర్‌వలి, మాజీ వక్ఫ్ బోర్డు మెంబర్ నిమ్మకాయల దర్బార్ వలి, ఫర్నిచర్ షాపు నిర్వాహకుడు బాబావలి, మండల కో-ఆప్షన్ హుస్సేన్, మాజీ ఎంపిటిసి గంగరాజు, అయ్యవారిపల్లె సర్పంచు రామగంగిరెడ్డి, మాజీ సర్పంచు ప్రసాద్ రెడ్డి, షాదీఖానా చైర్మన్ షేక్షావల్లి, టైల్స్ మౌలా, నాయకులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-నందలూరు

నిరంతర సేవా కార్యక్రమాలతో ముందుకు వెళుతున్నటువంటి నందలూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కుర్రా మణి యాదవ్ కుమారులు కుర్రా మురళీకృష్ణ, కుర్రా వంశీకృష్ణల జన్మదినం సందర్భంగా మంగళవారం నందలూరు రైల్వే గేటు ఆవరణంలో పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుర్రా మణి యాదవ్ మాట్లాడుతూ పేదవారి ఆకలి తీర్చడమే లయన్స్ క్లబ్ సేవలలో ప్రథమ కర్తవ్యం, నినాదం అని తెలుపుతూ ఇటీవల లయన్స్ క్లబ్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ అల్పాహారం పంపిణీ కార్యక్రమంలో పలువురు పేదలు విరివిగా పాల్గొని అల్పాహారాన్ని ఆరగించి తమ సంతోషాన్ని వెలిబుచ్చారు. కార్యక్రమంలో నందలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దాసరి నరసింహులు, వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ శ్యామనబోయిన గురుప్రసాద్, లయన్స్ క్లబ్ చైర్ పర్సన్ కొత్తపల్లి రాజా చారి, రామ్మోహన్‌రెడ్డి, ఆంజనేయులు, గొబ్బిళ్ళ మణి దుర్గయ్య, పాటూరు రమేష్, ధర్మ తేజ పాల్గొన్నారు. **సుండుపల్లి:** మండల కేంద్రానికి సమీపంలోని తిమ్మసముద్రం పంచాయతీ దేవలాల మిట్ట చంద్రమౌలేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అయ్యప్ప మాలధారణ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం వెంకటరమణ, రెడ్డమ్మ కుటుంబీకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 400 మంది అన్నదానానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చైర్మన్ శంకర్, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, రమణయ్య, సుబ్రహ్మణ్యం, భరత్, చంద్ర, వినోద్ పాల్గొన్నారు.

పెద్దూరుకు వెళ్లే దారిలో స్తంభించిన రాకపోకలు

బస్టాండ్ వద్ద ట్రాఫిక్ సమస్య

ఇబ్బందుల్లో వాహనదారులు

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక బస్టాండ్ వద్ద రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య అధికమైంది. బస్టాండ్‌లో పెద్దూరుకు వెళ్లే దారిలో వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా రోడ్డుకు ఇరువైపులా ద్విచక్ర వాహనాలు, ఆటోలు నిలుపుతున్నారు. దీంతో ఇతర వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా స్కూల్ బస్సులు, ఆటోలు ఎదురెదురుగా వస్తే పక్కకు వెళ్లడానికి కూడా దారి లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఆర్అండ్‌బి అధికారులు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణకు గురైన స్థలాలను విశాల పరచాలని ప్రజలు కోరుతున్నారు.

సమరభేరి ర్యాలీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-నందలూరు/పీలేరు

ఈ నెల 24వ తేదీన తిరుపతి పట్టణంలో నిర్వహించే దళితుల సమరభేరి ర్యాలీని జయప్రదం చేయాలని ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు జ్యోతి శివ, పీలేరు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు నగరిమడుగు సుభాష్ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా దివంగత ముఖ్యమంత్రి రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి దళితుల అభ్యున్నతికి, సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండగా దళితుల కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు తీసుకువచ్చారన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన దగ్గరనుంచి, గతంలో ఉన్న దళిత సంక్షేమ అభివృద్ధి పథకాలను రద్దు చేశారని, దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని పేర్కొన్నారు. దళిత వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ఈ తుగ్లక్ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని గద్దె దింపేంతవరకు కలిసికట్టుగా ఉద్యమం చేపట్టాలన్నారు.కావున రాజంపేట నియోజకవర్గంలో ఉన్న ఎస్సీ సెల్ కమిటీలు రాష్ట్ర నాయకులు పార్లమెంట్ నాయకులు అందరూ కలిసి ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు.

పెద్దిరెడ్డి కుటుంబం మాటతీరు మార్చుకోవాలి

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

చంద్రబాబు నాయుడుపై ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని, వారి మాటతీరు మార్చుకోవాలని రాజంపేట పార్లమెంటు టిడిపి నేత గంటానరహరి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రజల రెచ్చగొట్టి ప్రభుత్వంపై ఉసుగలుపుతున్నారని మిథున్ అనడం ఆయనకే చెల్లిందన్నారు. మూడున్నర ఏళ్ల వైసిపి ప్రభుత్వం తీరు, ప్రజా వ్యతిరేక పాలన నచ్చకనే ప్రజలు ప్రభుత్వంపై తిరుగుబడుతున్నారని తెలిపారు. చంద్రబాబు నాయుడుని, లోకేష్‌ని ఏకవచనం, పరుష పదజాలంవాడిన ద్వారకానాథ్‌రెడ్డి మాటతీరు మార్చుకోవాలన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక మదనపల్లెను ఏమి అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. నిబంధనలు పెట్టి నేతన్న నేస్తంలో కోతలు విధించి చేనేత కార్మికుల పొట్ట కొట్టారని విమర్శించారు. మెడికల్ కాలేజీ నిర్మాణం ముందుకు సాగలేదన్నారు. టమాటా ప్రాసెసింగ్ యూనిట్ ఊసే ఎత్తలేదని విమర్శించారు. అసలు విద్యాదీవనలో గత ఏడాది ఒక కంతు విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో జమ కాలేదని గుర్తు చేశారు.

చర్మవ్యాధి నివారణకు టీకాలు

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని పాడి రైతులు తమ పశువులకు ముద్ద చర్మవ్యాధి నివారణ కోసం తప్పని సరిగా టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారులు డాక్టర్ విక్రమ్‌రెడ్డి, డాక్టర్ ఊసమన్ పేర్కొన్నారు. మంగళవారం సిద్ధవరం, శివపురం, పాపేపల్లి పంచాయతీలో ముద్దచర్మవ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముద్ద చర్మవ్యాధి పశువులను శర్మపైన గుండ్రని బొబ్బలు రావడం, కాళ్ళు, గొంతు క్రింద వాపురావడం, ఎక్కువ జ్వరం రావడం, బొబ్బలు పగలడం వట్టి లక్షణాలు ఉంటాయని పేర్కొన్నారు. రైతులు వ్యాధి సోకిన పాడిపశువులను వేరు చేయాలని, ఈ వ్యాధి వైరస్ వలన అధికంగా వ్యాప్తి చెందుతున్నారు. ఈగలు, దోమలు వాలకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు, ముందు జాగ్రత్తగా ముద్ద చర్మవ్యాధి నివారణకు టీకాలు వెపించాలన్నారు. మండలంలో 7500 పశువులకు ఉచితంగా టీకాలు వేశామని చెప్పారు. ప్రతి సచివాలయంలో పరిధిలో ఉండే పశు వైద్య సహాయక సిబ్బంది గ్రామాలు వెళ్ళి టీకాలు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు ఉచితంగా టీకాలు వేస్తున్న సిబ్బంది



7న జిల్లా స్థాయి యువజనోత్సవ పోటీలు

కడప : జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో భాగంగా యువతకు కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో డిసెంబరు 7న వివిధ అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు సెట్ సిఇఒ సి.సాయి గ్రేస్ ఒక ప్రకటనలో తెలిపారు. శాస్త్రీయ గీతం(కర్నాటక, హిందుస్తాని), శాస్త్రీయ నృత్యం(కూచిపూడి, భరతనాట్యం, కథక్, మణిపురి, ఒడిస్సీ), శాస్త్రీయ వాయిద్యం(వీణ, సితార్, తబలా, మృదంగం, గిటార్, ఫ్లూట్, హార్మోనియం), జానపదనృత్యం(గ్రూప్) అంశాలలోనూ పోటీలుంటాయన్నారు. వీటితో పాటు క్విజ్, మోడరన్ సాంగ్(సోలో), మోడరన్ డాన్స్(సోలో), మేజిక్, మిమిక్రి, ఎంట్రిలోక్విజం, వయోలిన్, పెయింటింగ్, ఫాన్సీడ్రెస్, గ్రూప్ డిస్కషన్స్, సాహస కృత్యాలు, స్కల్చర్, అడ్వెంచర్ ఇవి తెలుగులో మాత్రమే ప్రదర్శించవలసి ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల యువత bit.ly/YSRKDP లింకులో తమ పేర్లను డిసెంబరు నెల 4లోపు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు కసరత్తు

- రూ.125 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం
- పులివెందుల, మైదుకూరులో ఏర్పాటు
- అరటి, టమోటా యూనిట్లకు మొగ్గు?

ప్రజాశక - కడప ప్రతినిధి

వైఎస్ఆర్ కడప జిల్లాలో ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు కసరత్తు ఊపందుకుంది. జిల్లా ఉద్యానశాఖ అరటి, టమోటా పండ్ల ప్రాసెసింగ్ ఏర్పాటు చేయడానికి గల అవకాశాలను పరిశీలిస్తోంది. రాష్ట్రంలో అరటి, టమోటా ధరల్లో తీవ్ర ఒడిదుడుకులు కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు పెద్దఎత్తున నష్టపోతున్న సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తే చిప్స్, ఫ్లేట్స్, డిప్పోని వంటి వాణిజ్య ఆహార, వస్తు ఉత్పత్తులను తయారు చేసి మార్కెట్లకు తరలించే ఆలోచనలు సాగిస్తోంది.ఉద్యాన రైతులకు మద్దతు, గిట్టుబాటు ధరల్లో ఏదోఒకటి అందించే అవకాశం ఉందనే కోణంలో ఆలోచనలు సాగిస్తోంది. జిల్లాలో అత్యధిక పండ్ల ఉత్పాదనలు, పండ్ల వినియోగాలపై దృష్టి సారించింది. అత్యధిక ఉత్పాదనలు, మార్కెట్‌లో పరిస్థితుల ఎలా ఉంటాయనే అంచనాల మేరకు ముందుకెళ్లే ఆలోచనలు చేస్తోంది. కడప జిల్లాలో 19,980 ఎకరాలకుపైగా అరటి సాగవుతోంది. సుమారు 5,18,549 మెట్రిక్ టన్నుల మేర ఉత్పాదన లభిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో పులివెందుల నియోజకవర్గ పరిధిలోని లింగాల, వేముల, సింహాద్రిపురం వంటి మండలాలు, మైదుకూరు, ఒంటిమిట్ట తదితర మండలాల్లో పెద్దఎత్తున అరటి సాగవుతోంది. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని పులివెందుల, వేముల, లింగాల నుంచి వచ్చిన నాణ్యమైన అరటి ఉత్పాదులను దేశాయ్ ఫ్రూట్ అనే కంపెనీ మలేషియా, సింగపూర్ తదితర విదేశాలకు ఎగుమతులు చేస్తున్న నేపథ్యం తెలిసిందే. కడప, అన్నమయ్య జిల్లాలోని రాజంపేట, పుల్లంపేట, చిట్వేలి, ఓబులవారిపల్లి, రైల్వేకోడూరు మండల ప్రాంతాల్లోని అరటి ఉత్పాదనలకు గిరాకీ కల్పించడానికి ఉద్దేశించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడానికి కసరత్తు చేస్తోంది. పులివెందుల, మైదుకూరు ప్రాంతాల్లో అరటి ఫుడ్ ప్రాసెసింగ్, రూ.125 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. మైదుకూరు మండల పరిసర ప్రాంతాల్లో ఐదు వేల ఎకరాల్లో టమోటా సాగవుతోంది. ఇక్కడి నుంచి 41,543 మెట్రిక్ టన్నుల దిగుబడి లభిస్తోంది. ఏటికేడు అరటి, టమోటా ఉత్పత్తులు పెరుగుతున్న నేపథ్యంలో మైదుకూరులో అరటి, టమోటా ఫుడ్ ప్రాసె సింగ్ యూనిట్లను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మైదుకూరుకు సంబంధించిన ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు ఉద్యానశాఖ పరిధిలోనే ఉన్నట్లు తెలిసింది. త్వరలో వీటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన అనంతరం ఏర్పాటుకు గల సాధ్యాసాధ్యాలను నిర్ణయించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఏదేమైనా ఉద్యాన పంటల ధరల ఒడిదుడుకుల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న మూడు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కారణంగా రైతాంగ ఉత్పత్తులకు వాణిజ్య పరమైన హంగులను అద్దడం ద్వారా మద్దతు, గిట్టుబాటు ధరలు లభించడమే గాకుండా ధరల స్థిరీకరణకు ఆస్కారం ఏర్పడనుందనే వాదన వినిపిస్తోంది.

బకాయిల కోసమే పోరాటం : యుటిఎఫ్

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయుల పోరాటం గొంతెమ్మ కోర్కెల కోసం కాదని, ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన బకాయిల కోసమేనని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉమ్మడి జిల్లాల అధ్యర్యంలో జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ రాజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు పాదయాత్రలోనూ, పలు బహిరంగ సభల్లో తాను అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తానని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తానని, ఉద్యోగ ,ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలు ఇస్తానని పలు హామీలు ఇచ్చి నమ్మించి మోసం చేశారని పేర్కొన్నారు. సిపిఎస్ విధానం అలాగే కొనసాగుతోందని చెప్పారు.. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిందేనని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ వేతనాల నుంచి తమ అవసరాల కోసం దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ రుణాలను ఏళ్ల తరబడి చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కడప జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పి.హరి, డిఎ బకాయిలు చెల్లించిన పాపాన పోలేదన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్, సరెండర్ లీవ్ బకాయిలు సైతం ఏడాదికాలంగా చెల్లింపులకు నోచుకోవడం లేదని తెలిపారు. తమ అవసరాల కోసం దాచుకున్న సొమ్మును ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకోవడం వల్ల ఉద్యోగ,ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.హరిప్రసాద్, ఎస్.జాబీర్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు తాము దాచుకున్న సొమ్మును వారి అవసరాలకు చెల్లించకుండా వేధించిన ప్రభుత్వంగా జగన్మోహన్‌రెడ్డి సర్కార్ చరిత్రలో మిగిలిపోతుందని తెలిపారు. తమకు రావాల్సిన బకాయిల కోసం ఉద్యోగులు ఉద్యమిస్తే, ఉద్యోగులవి గొంతెమ్మ కోర్కెలని పేర్కొనడం మంత్రి బొత్స కే చెల్లిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రజలలో, ప్రభుత్వంలో భాగం కాదా అని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన అన్ని రకాల బకాయిలను తక్షణమే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈనెల 30న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.ఓబుల్ రెడ్డి, సహాధ్యక్షులు డి.రూతు ఆరోగ్య మేరీ, జిల్లా కార్యదర్శులు ఎస్.రావువర్ధన్, వెంకట్ రాజు, వై.మస్తానయ్య, పి.చంద్రశేఖర్, కె.జోజయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుజాత, సిపిఎస్ జిల్లా కన్వీనర్లు రమణయ్య, సుదర్శన్, పట్టణ కార్యదర్శి కరీముల్లా నాయకులు యస్.శశిధర్ కుమార్, కె.చెన్నయ్య పాల్గొన్నారు.

పరిహారం చెల్లించండి

గొల్లపల్లి సోమశిల నిర్వాసితుల లబోదిబో
వాస్తవాల ప్రాతిపదికన చెల్లించాలని వేడుకోలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులరెడ్డి

సోమశిల నిర్వాసితులకు సకాలంలో పరిహారం చెల్లించండి మహా ప్రభో అంటూ అట్లూరు మండలం గొల్లపల్లికి చెందిన శ్రీనివాసులరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం కడప ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1993లో సోమశిల బ్యాక్‌వాటర్ కారణంగా తమ గ్రామమైన గొల్లపల్లి ముంపునకు గురైందన్నారు. అప్పట్నుంచి కొందరు నిర్వాసితులైన తమ పరిహారం చెల్లింపునకు ఉద్దేశపూర్వకంగా అడ్డుపడుతున్నారన్నారు. 2013 హైకోర్టు వెలువరించిన తీర్పు మేరకు వాస్తవాల ప్రాతిపదికన తమ ఇళ్లకు పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. తమకు గిట్టని వారు దురుద్దేశపూర్వకంగా తమపై దుష్ప్రచారం చేస్తున్నారని, వారి మాటలు నమ్మరాదని విజ్ఞప్తి చేశారు. వారి కుతంత్రాలను హైకోర్టు మొదలుకుని లోకాయుక్త వరకు ఎదుర్కొని, నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని తేల్చేశామని తెలిపారు. తమ పరిహారం చెల్లింపులకు సంబంధించిన జిల్లా ఉన్నతాధికారులు వారి దుష్ప్రచారాన్ని నమ్మరాదని చెప్పారు. తమ పరిహారం చెల్లింపు ఆలస్యానికి అదనపు మొత్తాన్ని చెల్లించాలని ఆదేశాల్లో పేర్కొందని వివరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు తమకు చెల్లించాల్సిన పరిహారాన్ని సకాలంలో చెల్లించాలని, లేని పక్షంలో అధికారులే ఆలస్యానికి బాధ్యత వహించాల్సి ఉంటుందని విజ్ఞప్తి చేస్తున్నామ ని తెలిపారు.

'పది' పరీక్షలపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

ఈ విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారించి వందశాతం ఉత్తీర్ణ సాధించాలని, 'మనబడి నాడు-నేడు' అభివృద్ధి పనుల్లో వైఎస్ఆర్ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో విద్యాశాఖ అధికారులతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించడంలో పాటు వారిలో మానసిక వికాసం, నైపుణ్య, నైతిక విలువలను పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ప్రతి విద్యార్థి ఆరోగ్య సామర్థ్యం, ఎత్తు, బరువు ప్రమాణాలను ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వారి సాధారణ ఆరోగ్య సామర్థ్యాన్ని బట్టి మూడు రకాలైన గ్రీన్, బ్లూ, రెడ్ కార్డులను విద్యార్థులకు అందించాలన్నారు. విద్యార్థుల విద్య, ఆరోగ్యంతో పాటు కౌమార బాలికల పర్సనల్ కేర్ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మనబడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా జిల్లాలో మొదటి విడతగా 1040 ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాలైన మౌళిక సదుపాయాతో అధునాతన హంగులతో అభివృద్ధి చేస్తామని చెప్పారు. రెండో విడతలో జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పిల్లల్లో మానసిక వికాసం, సామాజిక స్పృహ పెంపొందించేలా ప్రతి రోజూ ప్రార్థనా సమయంలో విద్యార్థులకు సూక్తులు, వార్త విశేషాలు, జనరల్ నాలెడ్జ్ అంశాలను చదివి వినిపించాలన్నారు. కాకుండా పిల్లలచే పాఠాలు, పద్యాలు, సెమినార్స్, గ్రూప్ డిస్కషన్స్ నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. త్వరితగతిన పదవ తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తి చేసి రివిజన్ కూడా చేపట్టేలా విద్యాశాఖ అధికారులు చొరవ చూపాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సి.దేవరాజు, జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి, ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ, సమగ్ర శిక్ష, వయోజన విద్య, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప

వసతిగృహాన్ని పరిశీలిస్తున్న జడ్జి కవిత

ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఉంటున్న పిల్లల ఆరోగ్య విష యం పట్ల ఎప్పటికప్పుడూ జాగ్రత్తలు వహించాలని సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్. కవిత సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె కడప నగరంలోని ప్రభుత్వ పరిశీలనా గృహం, ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని, లీగల్ ఎయిడ్ క్లినిక్ ను సందర్శించారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ విధి విధానాలను తెలియజేశారు. ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. పిల్లలకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. వంటశాలను తనిఖీ చేశారు. విద్యా విషయంలో ఉపాధ్యాయులు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలి అని తెలియజేశారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015 గురించి వివరించారు. ఏదైనా సమస్య ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చును అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం పర్యవేక్షణ అధికారి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీలంకతో పోల్చడం మానుకోవాలి

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న కార్పొరేటర్ పాకా సురేష్

ఆంధ్ర ప్రదేశ్‌ను శ్రీలంకతో పోల్చడం ఇప్పటికైనా చంద్రబాబు మానుకోవాలని వైసిపి నాయకులు, కార్పొరేటర్ పాకా సురేష్ హితవు పలికారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్య మంత్రి గా పదవి చేపట్టాక టిడిపి, దాని మిత్రపక్షాలు, ఎల్లో మీడియా మొదలు పెట్టిన దుష్ప్రచారం చేస్తున్నాయని చెప్పారు. మంగళవారం స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం చేసిన 2.70.451 లక్షలకోట్ల అప్పుకి వడ్డీ కడుతూనే, రూ. 80వేల కోట్ల బకాయిలు ఇస్తూనే, దాదాపు లక్షా 80వేల కోట్లకి పైనే సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ప్రజల ఖాతాల్లోకి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి వేస్తున్నారని చెప్పారు. మన రాష్ట్రం మరో శ్రీలంక అవ్వదన్నారు. ప్రజా సంక్షేమమంలో అందరికన్నా మనమే ముందున్నామని పేర్కొన్నారు.

పాఠశాలకు మైక్ సెట్ వితరణ

కడప అర్బన్ : నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్ ప్రధానోపాధ్యాయులు నాగమణికి మైక్ సెట్‌ను వెంకట రామ రాజు, జ్యోతి లక్ష్మీ దంపతులు మంగళవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు అభ్యర్థన మేరకు తమ వంతు సహకారం చేశామని తెలిపారు. తమ కుమారుడు చరణ్ కుమార్ రాజు హాంకాంగ్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించిన గుర్తుగా అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

చింతకొమ్మదిన్నె : ప్రకృతి వ్యవసాయంపై రైతులకు రెండు రోజులపాటు శిక్షణ తరగతులు మంగళవారం కెవికెలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడుతుందని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా ప్రోత్సాహాలని అందజేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. శాస్త్రవేత్త మురళీకృష్ణ మాట్లాడుతూ జీవ నియంత్రణ పద్ధతుల ఆవశ్యకత ప్రకృతి వ్యవసాయంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. మనకు అందుబాటులో ఉన్న వేపా ఆకులు, వేప గింజలు, కానుగా, జిల్లేడు మొదలగు ఆకుల ద్వారా కషాయాల తయారీతో పురుగుల్ని, క్రిమి కీటకాలను నియంత్రించవచ్చని ఆయన పేర్కొన్నారు, శాస్త్రవేత్తలు చంద్రిక, విజయలక్ష్మి, శిల్పకళ, నాగిరెడ్డి, మహేష్ బాబు, సాయి మహేశ్వరి, చైతన్య ప్రసంగించారు.

ప్రజల అభ్యున్నతికి కృషి : ఉప ముఖ్యమంత్రి

ప్రజాశక్తి - కడప

ప్రజల అభ్యున్నతి కోసమే అహర్నిశలు కృషి చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ అన్నారు. మంగళవారం 11 వ డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ కె. శ్రీలలిత, డివిజన్ ఇన్‌ఛార్జి కె. భాస్కర్ ఆధ్వర్యంలో భాగ్య నగర్ కాలనీ సచివాలయం- 2 పరిధిలోని కొత్త హీరో హోండా షో రూం, సూర్య హాస్పిటల్ లైన్, మసీదు వీధులలోని పలు ప్రాంతాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్, నాయకులు, అధికారులతో కలిసి ఆయా వీధుల్లో నివాసాలన్నింటినీ తిరిగారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ప్రభుత్వ పథకాల లబ్ధి దారులతో నేరుగా మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రమణరెడ్డి, వైసిపి నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి, షేక్ మహమ్మద్ షఫీ, కో-ఆప్షన్ సభ్యులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముళ్ళ పొదలు తొలగింపు

ప్రజాశక్తి - వల్లూరు

రహదారిని శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ స్వాతి

మండల పరిధి లోని ఆదినిమ్మాయిపల్లి, మిట్టపల్లి , పుష్పగిరి ప్రధాన రహదారిలో సర్పంచ్ ఇంది రెడ్డి స్వాతి ఆధ్వర్యంలో ముళ్ళ పొదలను మంగళవారం తొలగించారు. పుష్పగిరి వెళ్లే దారిలో ఇరువైపులా రోడ్డుకు అడ్డంగా ఉన్న కంప చెట్లు వల్ల పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ఈ విషయం తెలుస్తున్న సర్పంచ్ రోడ్డుకు ఇరువైపుల ఉన్న ముళ్ల పొదలు పంచాయతీ సిబ్బందితో తొలగింపజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రియాజ్ అహ్మద్ , ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ కేశవ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

కడప అర్బన్ :రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ క్రీడ పోటీలకు కడప నగరంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు బాస్కెట్ బాల్, బాల్ బ్యాడ్మింటన్‌కు ఎంపికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యవతి విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ వెంకటసుబ్బమ్మను అభినందించారు. అండర్-14 బాస్కెట్ బాల్ ఎం. అర్చన, చంద్రిక, డి. రిజ్వానా, సి.మొబీనా, ఎన్.ఫర్హ అండర్-17 బాస్కెట్ బాల్ వసున్న, శిరీష, సుప్రజ అండర్-17 బాల్ బ్యాట్మెంటన్ ఎస్. రజినీ శ్రీ ఎంపికయ్యారు.

నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

ఒంటిమిట్ట : అన్నమయ్య డ్యామ్ నిర్వాహితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని తెలుగుదేశం నాయకులు జగన్ మోహన్ రాజు, కళ్ళుగీత కార్మిక సంఘం రాష్ట్ర టిడిపి మాజీ డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య డిమాండ్ చేశారు మంగళవారం సాయంత్రం స్థానిక హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జగన్‌మోహన్‌రాజు మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా అన్నమయ్య డ్యాము తెగిపోయి నష్టపోయిన వారికి ఏడాదైనా ఇంతవరకూ ఎలాంటి నష్టపరిహారం చెల్లించకపోవడం దారుణమని వాపోయారు. చెయ్యేరు పరివాహక ప్రాంతాలలో అనేక గ్రామాలు మునిగిపోయి, వేలాది కోట్లాది రూపాయలు నష్ట పోయారని చెప్పారు. అప్పట్లో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిర్వాహితులకు అన్ని విధాల సాయం చేస్తామని, ఇళ్ల హామీ ఇచ్చి ఇంతవరకూ ఎలాంటి సాయం చేయాలని వాపోయారు. అనంతరం రాష్ట్ర టిడిపి మాజీ కల్లుగీత కార్మిక సంఘం డైరెక్టర్ కొమర వెంకటయ్య మాట్లాడుతూ అన్నమయ్య డ్యామ్ తెగిపోయి ఏడాది అయినప్పటికీ నిర్వాహితులకు ఎలాంటి సహాయం చేయలేదని తెలిపారు. వెంటనే పరిహారం చెల్లించి బాధితులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి యువనాయకులు, మార్కెటింగ్ చైర్మన్ ఎద్దుల సాగర్, హరినాధరెడ్డి, విన్నురెడ్డి, షఫీవుల్లా , కార్యకర్తలుపాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - కడప అర్బన్

కమిషనర్ జి. సూర్య సాయి ప్రవీణ్‌చంద్ మంగళవారం 34 వార్డు బళ్లారి రోడ్డు, 4వ డివిజన్ ఆర్కే నగర్‌లో అసిస్టెంట్ కలెక్టర్‌తో కలిసి ప్రాంతాలను తనిఖీ చేశారు. బళ్లారి రోడ్‌లో నిర్వహించే పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాల ముందస్తు పనులను పరిశీలించారు. పారిశుధ్యంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని తెలిపారు. మెయిన్‌రోడ్డును ఎప్పటికప్పుడూ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని సూచించారు. పార్కింగ్‌లో తగిన స్థలాన్ని కేటాయించాలని సంబంధిత ప్లానింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆర్కే నగర్ ప్రాంతాలను పరిశీలిస్తూ అక్కడి ప్రజలకు కమిటీ హాల్ అభివృద్ధి చేసే విధంగా చూసుకోవాలని అధికారులకు తెలిపారు. పాఠశాల సమీపంలో మురుగునీరు వెళ్లేందుకు సరైన మార్గం లేనందున తక్షణమే కాల్వను ఏర్పాటు చేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - కడప అర్బన్

డైరెక్టర్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తామని ఎపిఎస్ ఆర్‌టిసి బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం ఎన్ఎంయు అసోసియేషన్ కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు ఎప్పటికప్పుడూ ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తున్నామని చెప్పారు. ఆర్‌టిసిని లాభాల బాటలోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం డైరెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివారెడ్డి, కడప రీజినల్ కార్యదర్శి సుధాకర్, కడప డిపో కార్యదర్శి శ్రీనివాసులు, ప్రెసిడెంట్ జయరామ్, కోశాధికారి బాషా, అన్ని డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమాచార శాఖ పబ్లిసిటీ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి- కడప

సమాచార పౌర సంబంధాల శాఖ కడప కార్యాలయంలో పబ్లిసిటీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న టి.వెంకట సుబ్బయ్య మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా మృతి చెందారు. డిపిఆర్ఒ వేణుగోపాల్‌రెడ్డి, సహాయ ఇంజినీర్ శ్రీనివాసరావు, అదనపు పిఆర్ఒ మస్తాన్‌సాహెబ్, సునీల్‌సాగర్, రవికుమార్, నాగయ్య, సిబ్బంది మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

ఇద్దరికి వైవీయూ డాక్టరేట్లు

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర శాఖ పరిశోధన విద్యార్థి ఎల్లటూరు చంద్రశేఖర్ కు వైవీయూ డాక్టరేట్ ను ప్రకటించింది. చంద్రశేఖర్ ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ద్వారా రీసెర్చ్ ఫెలోగా ఎంపికై వైవీయూలో పరిశోధక విద్యార్థిగా చేరారు. రసాయన శాస్త్రం శాఖ సహ ఆచార్యులు డాక్టర్ ఎల్.సుబ్రమణ్యం శర్మ పర్యవేక్షణలో 'ఎలక్ట్రోఆక్సిడేషన్ ఆఫ్ సెలెక్టెడ్ ఆర్గానిక్ మాలిక్యూల్స్ ఆన్ గ్రాఫెన్-బేస్డ్ నానోకాంపొజిటీస్ ఫర్ ఫ్యూయల్ సెల్ అప్లికేషన్స్' అనే అంశంపై పరిశోధన చేశారు. వైవీయు వీసీ ఆచార్య ఎం. సూర్యకళావతి ఆదేశాల మేరకు నియమితులైన నిపుణుల బృందం పరిశోధన గ్రంధం అధ్యయనం చేసి డాక్టరేట్‌కు అర్హత ఉందంటూ నిర్ధారిచారు. అలాగే ఆంగ్ల శాఖ పరిశోధన విద్యార్థి షేక్ అన్సార్ హుస్సేన్ డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. ఈయన ఆంగ్లశాఖ సహ ఆచార్యులు డాక్టర్ ఆర్వీ జయంత్ కశ్యప్ పర్యవేక్షణలో 'యూజింగ్ లిటరసీ సోర్స్ ఇన్ టీచింగ్ సాఫ్ట్ స్కిల్స్ ఇన్ సెలెక్టెడ్ ఇంజినీరింగ్ కాలేజెస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ -యాన్ ఎక్స్ ప్లోరేటరి స్టడీ' అనే అంశంపై పరిశోధన చేశారు. వైవీయు వీసీ ఆచార్య ఎం. సూర్యకళావతి ఆదేశాల మేరకు నియమితులైన నిపుణుల బృందం గ్రంధాన్ని అధ్యయనం చేసి డాక్టరేట్‌కు అర్హత ఉందంటూ నిర్ధారించారు. ఇరువురికి డాక్టరేట్ రావడం పట్ల విసి, రిజిస్ట్రార్, ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు అభినందించారు. అభినందించారు.

టౌన్‌షిప్ అక్రమాలపై విచారించాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

నిరసన తెలియజేస్తున్న అఖిలపక్ష నాయకులు

భావన టౌన్ షిప్ అక్రమాలపై ప్రభుత్వం విశ్రాంత జడ్జితో విచారణ నిర్వహించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం భావన టౌన్‌షిప్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరి ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర, నగర కార్యదర్శి వెంకట శివ, వివిధ పార్టీల ప్రజా సంఘాల నాయకులు ప్రసంగించారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్లాట్లు వేసి అమ్మడం సిగ్గుచేటు అన్నారు. ఆక్రమణదారులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు సెంటు భూమి ఇచ్చే ప్రభుత్వం పెద్దలకు వేల ఎకరాలు ఎలా కట్టబెడుతుందని ప్రశ్నించారు. వెంటనే విచారణ చేపట్టి దోషను శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మన్సూరు అక్బర్, యాదగిరి రాంప్రసాద్, జియావుద్దీన్, ఎమ్మార్పీఎస్ నాయకులు మాతయ్య, చిన్న సుబ్బయ్య పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిక్షణకు చర్యలు : సిఐ

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలను కాపాడుతూ నేరాల సంఖను తగ్గిస్తామని నూతనంగా బాధ్యతలు చేపట్టిన సిఐ సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మట్కా, జూదం లాంటి వాటిని అరికట్టి శాంతియుతంగా ప్రజలు జీవించడానికి కోసం కృషి చేస్తామని తెలియజేశారు. జూదం, ఇతర అసాంఘిక కార్యక్రమాలపై తమకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. సంఘవిద్రోహ చర్యలన్నీ అరికడతామని తెలియజేశారు. పోరుమామిళ్ల సర్కిల్ పరిధిలో ఎలాంటి అలజడులు జరిగినా వాటిని సమర్థవంతంగా పరిష్కరిస్తామని చెప్పారు. సమావేశంలో ఎస్ఐ హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రెగ్యులర్ టీచర్ లేక విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

మండలంలోని అక్కల్‌రెడ్డిపల్లె పంచాయతీ, అక్కల్‌రెడ్డిపల్లె దళిత కాలనీలో ఉన్న ఆర్‌సిఎం ప్రాథమిక పాఠశాలకు రెగ్యులర్ టీచర్‌ను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. పాఠశాలలో 32 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. రెండు నెలలుగా రెగ్యులక: ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో ఉన్న ఒక వాలంటీర్ ద్వారా పాఠశాల నడుస్తూ ఉంది. రెండు నెలల కిందటే రెగ్యులర్ ఉపాధ్యాయుడు డిప్యూటేషన్ మీద మరొక పాఠశాలకు వెళ్లారు. అప్పటి నుంచి విద్యాశాఖ అధికారులు రెగ్యులర్ ఉపాధ్యాయుని నియమించకపోవడంతో విద్యార్థుల చదువు కుంటుపడుతోంది. వెంకటాపురంలో ఉన్న గవర్నమెంట్ స్కూలుకు నాలుగు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి చదువుకోవడం మా పిల్లలకు కష్టంగా ఉందని తల్లిదండ్రులు వాపోతున్నారు. తమకాలనీలోని పాఠశాలలపై విద్యాశాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహించడం తగదన్నారు. ప్రయివేట్ పాఠశాలలో చదివించే స్థోమత లేక ప్రాథమిక పాఠశాలకు పంపుతామని చెప్పారు. ఇప్పటికైనా సంబంధితా ధికారులు స్పందించి రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

ఆర్‌సిఎం పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రతరం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

తమ సమస్యలను ప్రభుత్వం, యాజమాన్యం వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆర్‌టిపిపి కార్మికుల రీజినల్ జెఎసి పేర్కొంది. కాంట్రాక్ట్ కార్మికులు చేస్తున్న నిరసన మంగళవారం కూడా మెయిన్ గేట్ వద్ద కొనసాగింది. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎపి జెన్‌కోలో కాంట్రాక్ట్ కార్మికులుగా చాలీచాలనీ జీతాలతో పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమను పర్మినెంట్ చేయకుండా జిఒ 163 తెచ్చి కొత్తవారిని నియమించడం దారుణమన్నారు. సమస్యను పరిష్కరించాలని గతంలో ఎన్నోసార్లు విన్నవించినా ఫలితంలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

మెయిన్ గేట్ వద్ద నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

రాష్ట్ర స్థాయికి శ్రీచైతన్య విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు తమ విద్యార్థులు ఎంపికైనట్లు శ్రీ చైతన్య హైస్కూల్ కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. బాస్కెట్‌బాల్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను మంగళవారం కరస్పాండెంట్ చక్ర పాణిరెడ్డి, డైరెక్టర్ చేతన్‌రెడ్డి అభినందించారు. ప్రొద్దుటూరు పూజా ఇంటర్నేషనల్ పాఠశాలలో జిల్లాస్థాయిలో ఈ పోటీలు నిర్వహించారన్నారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో ప్రతిభ చాటినట్లు చెప్పారు. అండర్-14లో జిల్లాస్థాయిలో యశ్వంత్, కార్తీక్‌సాయి, ప్రవీణ్, గౌతమ్ ప్రతిభ చూపగా.. అండర్-17లో పుల్లారెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి, సురేష్‌కుమార్, చరణ్‌సాయి ప్రతిభ చూపారన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ క్రీడకు సంబంధించి జిల్లా జట్టు సభ్యుల ఎంపిక కార్యక్రమాన్ని మంగళవారం ఎర్రగుంట్ల క్రీడల కో-ఆర్డినేటర్ శివశంకర్ రెడ్డి, కమలాపురం క్రీడల కో-ఆర్డినేటర్ తిరుపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అండర్-14 బాలురకు సంబంధించి 23 మంది సభ్యులతో ఒక టీంను, అండర్-17 బాలికల టీంలో 22 మందిని, అండర్-17 బాలుర టీంలో 22 మందిని, అండర్-17 బాలికల టీంలో 22 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా తరపున ఎంపిక చేశారు. అలాగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ డిసెంబర్‌లో అండర్-17 బాలుర బాలికల ఫుట్‌బాల్ మ్యాచ్‌లు ఎర్రగుంట్ల బాలుర పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

ఎంపిక చేసిన జిల్లా టీంతో క్రీడల కో-ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు

టిటిడి చెంతకు 'ప్రకృతి' శనగలు

ప్రజాశక్తి - వేముల

ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో పండించిన శనగలను టిటిడి దేవస్థానానికి పంపనున్నారు. వీటిని అక్కడ లడ్డూ తయారీలో వినియోగిస్తారు. మండలంలోని గొందిపల్లి రైతు చంద్ర మోహన్‌రెడ్డి రసాయనాలు వాడకుండా ఉత్పత్తి చేసిన శనగలను టిటిడికి తరలించనున్నారు. విత్తనంతో పాటు వేప పిండి, ఆముదం పిండి సాగులో వేశారు. అంతర పంటలుగా ఆవాలు, ధనియాలు, ఎరా పంటగా పొద్దుతిరుగుడు చుట్టూ రక్షణగా జొన్న పంట వేశారు. 20 రోజుల్లో పంట దిగుబడి వస్తుంది. పచ్చ పురుగు నివారణకు ముందు జాగ్రత్తగా 5 రకాల ఆకులతో ఆముదం, సీతాఫలం ఆకు, బొప్పాయి ఆకు, ఉమ్మెత్త ఆకు, వేప ఆకు, ఆవు మూత్రంతో బ్రహ్మాస్త్రం కషాయాన్ని తయారీ చేయించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎం.రామంజనేయులు, వెంకటేశు, వినోద్‌కుమార్‌రెడ్డి, శాంతమ్మ పాల్గొన్నారు.

ఆకులతో రసాయనాన్ని తయారు చేస్తున్న సిబ్బంది

కలిసిమెలిసి ఉండాలి : సిఐ

ఎర్రగుంట్ల : హిందూ, ముస్లింలు కలిసిమెలిసి అన్నదమ్ముల్లా ఉండాలని సిఐ మంజునాథరెడ్డి కోరారు. స్థానిక మహబూబ్ సుభాని దర్గాలో గ్యార్మీ పండుగ సందర్భంగా మంగళవారం ఆయన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంఠ ఎస్ఐ కృష్ణయ్య, సిబ్బంది, ముస్లింలు పాల్గొన్నారు.

మెలకులవలు పాటిస్తే అధిక దిగుబడులు

జమ్మలమడుగు రూరల్ : పసుపు సాగులో రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాఖ సహాయకులు ఇంతియాజ్ సూచించారు. పి. బొమ్మేపల్లిలో మంగళవారం పసుపు రైతులకు ఉద్యాన శాఖ తోటబడిని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ గత నెలలో కురిసిన వర్షాల వల్ల పసుపు పంటను ఆకుమచ్చ తెగులు, దుంపకుళ్లు ఆశించిందన్నారు. దీన్ని అరికట్టేందుకు కార్బండజేమ్-1 గ్రాము లేదా ముకోజెబ్ 2.5 గ్రాములు లేదా ప్రాజెకోనాజర్-1 మిల్లి గ్రామును ఒక లీటర్ నీటికి కలుపుకొని పిచికారి చేయాలన్నారు. దుంపకుళ్లు నివారణకు రిడోమిల్ గోల్డ్ 3 గ్రాములకు ఒక లీటర్ నీటిని కలుపుకుని మొక్క మొదళ్లలో పోయాలన్నారు. పసుపులో తెగుళ్ల నివారణ చేపడితే మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. సర్పంచు రామనాథ్‌రెడ్డి, వైసిపి నాయకులు ప్రతాప్‌రెడ్డి, రైతులు చౌరెడ్డి, వీరారెడ్డి, హనుమంత్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, వాలంటీరు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

లక్ష్యా అకాడమీ విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-కడప సిటీ

ఎస్ఎస్‌సి-జిడి ఉద్యోగాలలో లక్ష్యా అకాడమీ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని డైరెక్టర్ బసిరెడ్డి పొలిరెడ్డి పేర్కొన్నారు. ఆయన ప్రజా శక్తితో మాట్లాడుతూ గత ఏడాది జులైలో విడుదలైన ఎస్ఎస్‌సి -జిడి ఉద్యోగాల భర్తీ కోసం ప్రకటన విడుదలైందని చెప్పారు. తమ ఇన్స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్న ఆరుగురు పరీక్షల్లో విజయం సాధించారని పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిలో సునీత, ఎ.సురేష్, కె.పవన్ కళ్యాణ్, బి.సురేంద్రకుమార్‌రెడ్డి, ఆర్. జ్ఞానేంద్ర, విష్ణు ఉన్నారని చెప్పారు. వారు విజయం సాధించడంలో కృషి చేసిన లక్ష్యా అకాడమీ అధ్యాపకులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఇటీవలే తిరిగి ఎస్-ఎస్‌సి-జిడిలో 24369 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల విడుదలైందని, ఈనెలాఖరి దరఖాస్తుకు గడువు అని పేర్కొన్నారు. ఓసి అభ్యర్థులు 26 ఏళ్లు, ఎస్‌సి, ఓబిసిలు 29 ఏళ్లుగా, ఎస్‌సి, ఎస్‌టిలు 31 ఏళ్ల వయోపరిమితి కలదన్నారు. కరోనా కారణంగా మూడేళ్లు అన్ని వర్గాల వారికి వయో పరిమితి పెంచారని అభ్యర్థులు గమనించాలని తెలిపారు. తమ లక్ష్యా అకాడమీలో ఎస్ఎస్‌సి - జిడి క్లాసులు ప్రారంభమయ్యాయని, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

సమాజ సేవలో ఇఆర్‌కెఆర్ ట్రస్ట్

పలు సేవా కార్యక్రమాల్లో ట్రస్ట్ చైర్మన్ ఇరగంరెడ్డి కార్తీకరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

తనకు ఉన్నంతలో ప్రజలకు, విద్యార్థులకు సేవ చేయాలనే తలంపుతో సమాజ సేవకు ఇఆర్‌కెఆర్ ట్రస్ట్ కదిలింది. ఆ మేరకు ట్రస్ట్ చైర్మన్ ఇరగంరెడ్డి కార్తీకరెడ్డి పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. సాధారణ పేద కుటుంబంలో పుట్టి ఇంజనీరింగ్ విద్య చదివి తద్వారా పది రూపాయలు పోగు చేసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అడుగుపెట్టిన కార్తీక్‌రెడ్డి ఆర్థికంగా స్థిరపడ్డారు. అతి తక్కువ వయసులోనే రియల్ ఎస్టేట్ వ్యాపారంలో బెంగళూరు, హైదరాబాదు నగరాల్లో రాణించి యువతకు ఆదర్శంగా నిలిచారు. సంపాదనకే పరిమితం కాకుండా సహాయం కోరితే తనవంతు సహకారాలు అందిస్తూ ముందుకు సాగుతున్నారు. సేవే లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. చాపాడు మండల పరిధిలో ఇప్పటికే దేవాలయాల అభివృద్ధికి, అన్నదానానికి, విద్యార్థులకు ఆర్థికసహాయం అందిస్తూ కార్తికరెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారు. లక్ష్మీపేటలోని సాయిబాబా దేవాలయానికి రేకుల షెడ్డు నిర్మాణానికి రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అల్లాడుపల్లె దేవాలయాల్లో కార్తీకరెడ్డి రెండవ సోమవారం సందర్భంగా రూ.లక్ష అన్నదానానికి సహకరించారు. చియ్యపాడు గ్రామంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ముగ్గురు రైతులకు, రోడ్డు ప్రమాదంలో చనిపోయిన అందే గ్రామానికి చెందిన ఒక కార్మికుని కుటుంబానికి ఒకొక్కరికి రూ.25వేల ఆర్థిక సహాయం అందజేసి, అందరి ఆదరా భిమానాలు పొందారు. పేద విద్యార్థులు అభ్యసిస్తున్న కస్తూరిబా బాలికల పాఠశాలలో విద్యార్థుల అవసరాన్ని గుర్తించి వారు అడగకుండానే రూ.40 వేలు విలువచేసే కంప్యూటర్, యుపిఎస్ సదుపాయాన్ని కల్పించారు. అలాగే అదే పాఠశాలలో 10వ తరగతి చదివే విద్యార్థుల్లో 2023 మార్చి ఫలితాల్లో మొదటి స్థానంలో నిలిచే వారికి రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని ప్రకటించారు. చాపాడు మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో పదవ తరగతిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచే విద్యార్థులకు రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేస్తానని ప్రకటించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలతోపాటు వివిధ సమస్యలతో తన వద్దకు వచ్చే యువతకు అప్పటికప్పుడు సహాయాన్ని అందజేస్తున్నారు. తాను సంపాదించిన దానిలో అధిక భాగం సేవా కార్యక్రమాలకే వినియోగించేందుకు సిద్ధపడతానని కార్తీక్‌రెడ్డి పేర్కొంటున్నారు. తాను పేదరికాన్ని అనుభవించానని, కష్టపడి ప్రస్తుతం ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశాలు వచ్చాయన్నారు. సమాజంలో కష్టాలు పడే వారి గురించి తన దృష్టికి వేస్తే తనవంతు సహాయం అందించేందుకు ముందుంటానని చెబుతున్నారు. సమస్యల గురించి తనకు తెలియజేస్తే తనకు ఉన్నంతలో సహకారం అందిస్తానని కార్తీక్‌రెడ్డి తెలిపారు.

రైతు కుటుంబాలకు ఆర్థికసాయం చేస్తున్న కార్తీక్ రెడ్డి (ఫైల్‌ఫొటో)

కంప్యూటర్ వితరణ చేసినందుకు సన్మానం పొందుతున్న కార్తీక్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందులలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న హౌసింగ్ కాలనీ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయ్ రామరాజు, కడ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో మంగళవారం ఇళ్ల నిర్మాణ పనులకు సంబంధించి రాప్తాడు ఎమ్మెల్యే పొట్లదుర్తి ప్రకాష్‌రెడ్డి, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న కాలనీ నిర్మాణ పనుల్లో వేగాన్ని పెంచాలన్నారు. జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు తాగునీరు డ్రైనేజీ తదితర విషయాలపై చర్చించారు. అనంతరం ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో మోడల్ టౌన్‌లో వేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. నిధులకు సంబంధించి రాజీ పడకుండా పనులు నిర్మించాలన్నారు. ముఖ్యంగా సిఎం డిసెంబర్‌లో పులివెందుల పర్యటనకు వచ్చేనాటికి వీటిని పూర్తి చేసి, ఆయనతో ప్రారంభించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పాడా ఓఎస్‌డి అనిల్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్ రెడ్డి, పురపాలక చైర్మన్ వరప్రసాద్, ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తహశీల్దార్ మాధవకృష్ణారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతి కుటుంబానికీ ప్రయోజనం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలతో ప్రతి కుటుంబానికి ప్రయోజనమని ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. నగర పంచాయతీలో మంగళవారం ఆయన 20వ వార్డులో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా రాణివనంలో నూతనంగా నిర్మించిన ఉపరితల జలాశయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి గడప తిరుగుతూ ప్రజల సమస్యలపై ఆరా తీశారు. ఈ నేపథ్యంలో స్థానికులు రోడ్లు, తాగునీటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఇందుకు ఆయన స్పందిస్తూ వాటిని పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ అలీ, జడ్‌పిటిసి బాలయ్య, కో-ఆప్షన్ సభ్యులు, కమిషనర్ జగన్నాథ్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే, చైర్మన్

కనీస వసతులు కల్పించాలని వినతి

డిటికి వినతిపత్రాన్ని ఇస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జగనన్న కాలనీల్లో కనీస వసతులు కల్పించాలని టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణుగోపాల్ కోరారు. ఆ మేరకు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ మనోహర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రతి పేదవానికి 2 సెంట్ల స్థలంతో తామే ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు గడించినా ఆ మేరకు నెరవేరలేదన్నారు. లబ్ధిదారుడే ఇంటిని నిర్మించుకోవాలని చెప్పడం పేద ప్రజలను దగా చేయడమేనన్నారు. కనీసం ఆ కాలనీల్లో గతుకులు లేకుండా రోడు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలు రోగాల బారిన పడకుండా మంచినీటి వసతి కల్పించాలన్నారు. నియోజకవర్గంలోని పేదలకు తామే ఇళ్లు కట్టించి యివ్వకపోతే ప్రజలకు తమ ముఖం చూపించనని, మళ్లీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని చెప్పిన ఎమ్మెల్యే కూడా వెంటనే స్పందించాలన్నారు. పేదవారి సొంతింటి కలను యిచ్చిన మాట ప్రకారం ప్రభుత్వమే నిర్మించి, కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నందమూరి యువసేవా సమితి అధ్యక్షుడు గోమేధికమ్ సుదర్శన్, కడప పార్లమెంటరీ ఎస్‌టి సెల్ ప్రధాన కార్యదర్శి నాసారి లక్ష్మీనరసింహా, కడప పార్లమెంటరీ ఎస్‌సి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.మల్లికార్జున, కడప పార్లమెంటరీ కార్యదర్శి సి.సిద్ధయ్య, నాయకులు మదూరు మణి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - చాపాడు

ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఎంపిపి టి.లక్ష్మమయ్య కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా గ్రామాల్లో విద్యుత్ సమస్యలు అధికంగా తలెత్తుతున్నాయని, ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో విద్యుత్ సమస్యలు ఉన్నట్లు ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తెచ్చారన్నారు. ప్రజల సౌకర్యార్థం స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరులో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా ఉపాధి హామీ పథకంలో నాటిన మొక్కలు ఎండిపోతున్నాయని, వీటి సంరక్షణకు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. మండల కేంద్రమైన చాపాడులో మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విజయనగరంలో అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవనం పూర్తి చేసేందుకు నివేదికలు సిద్ధం చేయాలని పిఆర్ ఎఇ ఈశ్వరయ్యకు సూచించారు. అభివృద్ధి పనులు ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని చియ్యపాడు ఎంపిటిసి బాల నరసింహారెడ్డి సభ దృష్టికి తెచ్చారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకానికి సంబంధించి త్వరగా డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అల్లాడుపల్లి సర్పంచు కిషోర్‌కుమార్ రెడ్డి సూచించారు. నాగాయపల్లిలో మినీ అంగన్వాడి కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సోమవారం సర్పంచు శ్రీనివాసులురెడ్డి కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, వైస్ ఎంపిపి శుభకరణమ్మ, సుందరమ్మ వ్యవసాయ అధికారి మ్యాగీ, ట్రాన్స్‌కో ఎఇ రవిశంకర్, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అరుణకుమారి, ఆర్‌అండ్‌బి ఎఇ దాదాబాషా, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి టి.లక్ష్మమయ్య

బడా బాబుల గుప్పిట్లో అసైన్డ్ భూములు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల నియోజకవర్గంలో బినామీ పేర్లతో బడా బాబుల గుప్పెట్లో అసైన్ భూములు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేలూరు శ్రీనివాసులురెడ్డి తెలిపారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నియోజకవర్గంలో అసైన్డ్ భూములు వందల ఎకరాల చొప్పున బినామీల పేరు మీద నడుస్తున్నాయని ఆరోపించారు. ఎక్కడైతే అసైన్డ్ భూములు బినామీల పేరు మీద ఉన్నాయో వాటిని నిగ్గు తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బినామీల పేరుతో ఉన్న భూములను అర్హులకు పంచాలన్నారు.


మాట్లాడుతున్న వేలూరు శ్రీనివాసులరెడ్డి

యువత వ్యాపార రంగంలో రాణించాలి : ఎంపీ

ప్రజాశక్తి - వేంపల్లె

యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా వ్యాపార రంగం వైపు దృష్టి పెట్టి, అందులో రాణించాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సూచించారు. స్థానిక మైనార్టీ ఈద్గా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మేరిజాన్ ఫర్నిచర్ దుకాణాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వ్యాపార రంగంలో రాణించేందుకు నాణ్యమైన వస్తువులను వినియోగదారులకు విక్రయించాలన్నారు. వ్యాపార రంగం వల్ల మరికొంత మందికి ఉపాధి అవకాశాలు కల్పించే వీలుంటుందన్నారు. వ్యాపార రంగంలో ఓర్పు ముఖ్యమన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వైసిపి ప్రభుత్వం పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను ఎంపీ స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి, సివిల్ సప్లయ్ డైరెక్టర్ షబ్బీర్‌వలి, మాజీ వక్ఫ్ బోర్డు మెంబర్ నిమ్మకాయల దర్బార్ వలి, ఫర్నిచర్ షాపు నిర్వాహకుడు బాబావలి, మండల కో-ఆప్షన్ హుస్సేన్, మాజీ ఎంపిటిసి గంగరాజు, అయ్యవారిపల్లె సర్పంచు రామగంగిరెడ్డి, మాజీ సర్పంచు ప్రసాద్ రెడ్డి, షాదీఖానా చైర్మన్ షేక్షావల్లి, టైల్స్ మౌలా, నాయకులు పాల్గొన్నారు.

ఫర్నీచర్ షాపును ప్రారంభిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

మండలాభివృద్ధికి కృషి : ఎంపిపి

ప్రజాశక్తి - మైలవరం

మండల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎంపిపి చేరెడ్డి సావిత్రి, చెన్నకేశవరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని జి.ఉప్పలపాడు గ్రామంలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయాన్ని మంగళవారం వారు సందర్శించారు. అనంతరం ఎంపిపి దంపతులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు ద్వారా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. దీన్ని ప్రతిపక్షనేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కడప పార్లమెంట్ సభ్యులు అవినాష రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సహకారంతో మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు.

స్వామిని దర్శించుకుంటున్న ఎంపిపి సావిత్రమ్మ

పంట నమోదు చేయించుకున్న రైతులకు ప్రయోజనం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఇ-క్రాప్ చేయించుకున్న ప్రతి రైతులు రశీదు ఇచ్చామని, దీనివల్ల వారికి బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ అందుతుందని ఎఒ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పెదనపాడు, తిప్పలూరు రైతు భరోసా కేంద్రాలను మంగళవారం కమలాపురం డివిజన్ వ్యవసాయ సలహా సంచాలకులు నరసింహారెడ్డి, ఎఒ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రశీదు పొందిన రైతులకు బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ రాకపోతే అధికారులను అడగవచ్చన్నారు. ప్రతి గ్రామంలో రశీదులు, సెల్‌లకు ఎస్ఎంఎస్‌లు డిజిటల్, రాతపూర్వకంగా పంపామన్నారు. కార్యక్రమంలో పెద్దనపాడు, తిప్పలూరు గ్రామాల వ్యవసాయ సహాయకులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.


పెదనపాడు ఆర్‌బికె వద్ద రైతులకు రశీదును అందజేస్తున్న అధికారులు

రేపు వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మైదుకూరు పట్టణంలో గురువారం నిర్వహించే వ్యవసాయ కార్మిక సంఘం 6వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి.శివకుమార్ కోరారు. స్థానిక సుందరయ్య భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభకు సంఘం రాష్ట్ర కార్యర్శి వెంకటేశ్వర్లు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా గతకాలపు పోరాటాలను సమీక్షించి, అనంతరం రాబోవు రోజుల్లో నిర్వహించాల్సిన కర్తవ్యాలను రూపొందించనున్నారని తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు పొట్టిశ్రీరాములు సర్కిల్ నుంచి ర్యాలీగా కడప రోడ్డులోని షాదీఖానా వరకు నిర్వహిస్తామన్నారు.

మాట్లాడుతున్న శివకుమార్

అధికారులపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఒక విద్యార్థి మృతి చెందాడని, గతంలో కూడా ఇద్దరు చిన్నారులు చనిపోయారని ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గండి సునీల్‌కుమార్, మండల కార్యదర్శి ఎర్రంపల్లి అజయ్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయం వద్ద మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల మృతికి ప్రిన్సిపల్ బాధ్యత వహించాలన్నారు. వరుస ఘటనలు జరుగుతున్నా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. విద్యార్థి కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు కలివేల రాజశేఖర్, సహాయ కార్యదర్శి అల్లూరి సందీప్, మండల నాయకులు రాహుల్ పాల్గొన్నారు.

ప్రమాద కేసులో రెండేళ్లు జైలు

వేంపల్లె : మండలంలోని పాములూరు వద్ద 2017లో జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో ఉత్తమారెడ్డి అనే వ్యక్తికి పులివెందుల మెజిస్ట్రేట్ రెండేళ్లు జైలు, రూ.5వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తిరుపాల్‌నాయక్ చెప్పారు. వీరపునాయునిపల్లె మండలం ఓబుల్‌రెడ్డి పల్లెకు చెందిన నీలం గంగా మహేంద్ర అనే వ్యక్తి మోటర్ బైకులో పోతుండగా ఉత్తమారెడ్డి అనే వ్యక్తి ట్రాక్టర్‌తో మోటర్ బైకును ఢీకొట్టాడు. బాధితుడి సోదరుడు గంగా ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. గంగ మహేంద్ర చికిత్స పొందుతూ మృతి చెందాడు.

IN THE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL CUM-I ADDITONAL DISTRICT JUDGE, KADAPA AT PRODDATUR.
M.V.OP. No. 48/ 2021

Sanna Prabhu @ Bandi Vaddera Prabhu, S'o Lakshman, aged aboul 28 yeans,Hindu, Coolie, (Aadhaar No.6949 5772 5306)
Sanna Hanumanti a Hanumariti @ Bandi Vaddera Hanumanti, W/o Sanna Prabhu Bandi Vaddera Prabhu, aged about 20 yeas, Hindu. Coolie (Aadhaar No.7443 76ll 6945).
Both are native of Ingalgi Village, Vadi Mandal, chitapur Sub-District of Gulbargadistrict, Karnataka State, Pin Code-585 225, now residing at railway gate. ChilamkuruVillage, Yerraguntla Mandal, Kadapa District.
...Claimants

Vs

P. Scinivasula Reddy. Slo P. Rama Krishna Reddy, aged about 43 years, Hindu,Owner of the Self loading mobile conerete mixer vehicle bearing No.AP-27-BK3172, resident of D.No.4/159, Super Bazaar road, Proddatur town and Mandal, Kadapa District. **...Respondent No.1**

The claimants filed the petition in the above matter against you, if you lavegot any objection you may appear before this Hon'ble Tribunal at 10.30 A.M, on orbefore 02-12-2022, either in person or through an Advocate and tile your objection,if you failed to do so, the matter will be decided exparte.

//By Order of the Court//
E.V. SUDHAKAR REDDY, B.Com.,L.L.B.,
S. NOORULLAH,
Advocates
PRODDATUR, KADAPA DISTRICT.